క్లుప్తంగా

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వివిధ అంశాలపై చిన్నారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.గ్రంథాలయాధికారి అజేయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. రెండు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొన్నారు.నైపుణ్యం వెలికి తీయడానికి ఈ పోటీలు దోహదపడతాయని అతిథులు అన్నారు. ప్రతిభ చూపిన వారికి కార్యక్రమంలో అతిథులు జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రో గ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, రచయిత బి.సత్యానందం బహుమతులు ప్రదానం చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ముగింపు వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కంచరపాలెం: స్థానిక బొట్టా నర్సింగరావు భవనంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, బీఎన్ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసినట్లు కంచరపాలెం జోన్ కమిటీ సభ్యుడు కృష్ణరావు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో విజ్ఞానంతో కూడిన వినోదాత్మక అంశాలపై ప్రతి రోజూ శిక్షణ ఇచ్చామన్నారు. వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన లాబా గడబ

గోపాలపట్నం: గుర్తు తెలియని రైలు నుంచి జారిపడిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన వ్యక్తి వ్యక్తి మృతి చెందాడు. కొత్తపాలెం రైల్వే బ్రిడ్జ్ వద్ద చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి దువ్వాడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం జయంతిగిరికి చెందిన లాబా గడబ(39) గుర్తు తెలియని ట్రైన్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడడంతో మృతి చెందాడు. దువ్వాడ రైల్వే పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తికి సంబంధించినవారు దువ్వాడ రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వాసుదేవరావు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దిగువ సర్కిల్‌లో ఆటో డ్రైవర్లకు కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ వాసుదేవరావు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలని సూచించారు. రాంగ్ పార్కింగ్ చేసి ఫైన్లకు గురి కావద్దని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించవద్దని సూచించారు. అలాగే ఆటోల్లో ప్రయాణించే వారిని గమనించాలన్నారు. వారు ఎక్కడికి వెళ్తున్నారు.. తీసుకెళుతున్న లగేజీలను గమనించాలని తెలిపారు. మీకు తెలియకుండా ఆటోల్లో జరిగే నేరాలకు బలి కావద్దని ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. ప్రతీ డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష జనం.. కానరాని మైదానం!



గోతులు ఏర్పడిన మైదానంలో ఆడుతున్న యువత



ప్రకాష్‌నగర్ పాఠశాల మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

- పారిశ్రామిక ప్రాంతంలో పరిస్థితి
- దూర ప్రాంతాలకు వెళ్లి ప్రాక్టీస్ చేయాల్సి వస్తోందని క్రీడాకారుల ఆవేదన

మల్కాపురం: పారిశ్రామిక వాడలో కనీస వసతులతో కూడిన క్రీడా మైదానం లేదు. ఈ ప్రాంతంలో పలు క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. వారు నిత్యం ప్రాక్టీస్ చేసేందుకు సరైన మైదానం లేక దూర ప్రాంతాలకు వెళుతున్నారు. ఈ ప్రాంతంలో మైదానం ఏర్పాటు ప్రతిపాదన మాత్రం కాగితాలకే పరిమితమైంది.

క్రీడా వికాసానికి ప్రోత్సాహం కరువు

జీవీఎంసీ 58వ వార్డు నుంచి 63వ వార్డుకు సుమారు లక్షకు పైగా జనం నివాసం ఉంటున్నారు. వీరిలో సుమారు వెయ్యి మంది వరకు వివిధ క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులు ఉన్నారు. ఆయా క్రీడల్లో శిక్షణ పొందుతున్న వారు సుమారు 2 వేల మంది వరకు ఉంటారు. క్రికెట్,బాక్సింగ్,కరాటే,రన్నింగ్,షటిల్,బ్యాడ్మింటన్ వంటి క్రీడాకారులతో పాటు ఆయా క్రీడల్లో శిక్షణ పొందుతున్న వారు ఉన్నారు. అయితే వీరు గతంలో షిప్‌యార్డ్ కళాశాల ఎదురు మైదానంతో పాటు జింక్ మైదానంలో శిక్షణ పొందే వారు. షిప్‌యార్డ్ నేవల్ ఆధీనంలోకి వెళ్లడంతో ఆ గ్రౌండ్‌లోకి షిప్‌యార్డ్ ఉద్యోగులు, వారి పిల్లలను తప్పా ఇతరులను అనుమతించడం లేదు. జింక్ పరిశ్రమ మూతపడడంతో ఆ మైదానం నిర్వహణ లేక అధ్వానంగా మారింది.

ప్రతిపాదనల్లోనే..

ఇది ఇలా ఉంటే 2013లో హెచ్‌పీసీఎల్ నిధులతో గుల్లలపాలెం వద్ద జీవీఎంసీ వాకింగ్ పార్కులో ఆధునిక వసతులతో క్రీడామైదానం నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. చివరి నిమిషంలో ఆ నిధులు వేరే ప్రాంతానికి తరలిపోయాయి. దీంతో ఇక్కడ క్రీడామైదానం నిర్మాణం జరగలేదు. అలాగే 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద జీవీఎంసీ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మాణ ప్రాజెక్ట్ మధ్యలో నిలిచిపోయింది. దీంతో క్రీడాకారులు నగరంలోకి లేదా స్టీల్‌ప్లాంట్ మైదానానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

నగరంలోకి వెళ్లి ప్రాక్టీస్ చేస్తున్నా..



జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ఉంటున్నాను. మా ప్రాంతంలో బాక్సింగ్ ప్రాక్టీస్ చేసేందుకు సరైన మైదానం లేకపోవడంతో నగరంలోని పోర్టు స్టేడియం వద్దకు రోజూ వెళుతున్నాను.అధికారులు మల్కాపురం లేదా శ్రీహరిపురం పరిధిలో మైదానం ఏర్పాటు చేస్తే మంచిది.

– రేష్మా యాదవ్, మహిళా బాక్సర్

త్రోబాల్ ఆటకు గుడ్ బై చెప్పా..



స్టీల్‌ప్లాంట్ మైదానానికి వెళ్లే వాడిని కళాశాల నుంచి త్రోబాల్ క్రీడలో మంచి గుర్తింపు సాధించాను.అయితే జాతీయ,అంతర్జాతీయ పోటీలకు వెళ్లాలంటే మరింత ప్రాక్టీస్ అవసరం. మా ప్రాంతంలో సరైన మైదానం లేక స్టీల్‌ప్లాంట్ క్రీడామైదానానికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో త్రోబాల్ ఆట పూర్తిగా విడిచిపెట్టాను.

– ఆడారి హరీష్, ఇందిరాకాలనీ

ఘనంగా వేద గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవం



మహాపూర్ణాహుతిలో పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 94వ వార్డు పరిధి నాయుడుతోటలోని వేద గాయత్రిదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు రెండోరోజు ఆదివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. విశాఖ శ్రీశారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి వేడుకలో పాల్గొని పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక భావం ఎంతో గొప్పదని, భక్తులంతా ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని స్వామీజీలు అనుగ్రహ భాషణం చేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అమ్మవారికి నిత్యార్చన, అగ్నికార్యం, సహస్ర గాయత్రీ మంత్ర హవనం, ఉపదేవతా సహిత నవగ్రహ మంత్ర సూక్త హవనాలు, మహాపూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ద్రోణంరాజు శ్రీవాత్సవ, ఆలయ ధర్మకర్త రాపర్తి కన్నా, గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి వెండి కిరీటం బహూకరణ



కిరీటాన్ని ఏఈవోకు అందజేస్తున్న దాత రమేష్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సింహగిరి మెట్లమార్గంలోని ఆంజనేయస్వామికి అడవివరానికి చెందిన ఎం.రమేష్ అనే దాత వెండి కిరీటం బహూకరించారు. 990 గ్రాముల వెండితో తయారు చేయించిన కిరీటాన్ని ఆదివారం ఆలయంలో ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు, సిబ్బంది సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు పావనమూర్తికి సత్కారం



ప్రొఫెసర్ పావనమూర్తిని సత్కరిస్తున్న బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

సింధియా: బౌద్ధ మతం నలుదిశలా విస్తరించేందుకు పాటుపడిన అంబేడ్కరిస్ట్, భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు, భీమ్‌దళ్ చీఫ్ కమాండర్ ప్రొఫెసర్ పావనమూర్తిని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) విశాఖ బ్రాంచ్ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 98 ఏళ్ల ప్రాయంలో మంచానికి పరిమితమైన ఆయనను సీతమ్మధారలోని స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీఎస్ఐ సెక్రటరీ కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రొఫెసర్ పావనమూర్తి దేశవ్యాప్తంగా సంచరిస్తూ తెలుగు, హిందీ, మళయాళ మొదలగు భాషల్లో తన ప్రసంగాలతో యువతను ఉత్తేజపరుస్తూ సమసమాజ స్థాపన కృషి చేశారన్నారు. తన జీవిత కాలంలో చేసిన కృషికి అనేక పురస్కారాలు, అవార్డులు, పదవులు సొంతం చేసుకున్నారని కొనియాడారు. బీఎస్ఐ ప్రతినిధి దుర్గారావు మాట్లాడుతూ అణగారిన వర్గాల తరపున పోరాడి న్యాయం జరిగే వరకు అలుపెరగకుండా పోరాడే వారని, అంబేడ్కర్ ఆశయ సాధనలో కుల నిర్మూలన, బౌద్ధ ధర్మ వ్యాప్తికి చేసిన కృషి అభినందనీయమన్నారు. బౌద్ధ విస్తరణలో భాగంగా జైభీమ్, ప్రజాబంధు, దళితజ్యోతి, రిపబ్లిక్ జ్యోతి ధర్మప్రభ మహానాగ వంటి పత్రికలకు ఆర్థిక తోడ్పాటును అందించేవారని గుర్తు చేశారు. బీఎస్ఐ ప్రతినిధులు పెయ్యల సిద్ధార్థ, రాజారావు, యు.వి.రావ్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ వర్సిటీలతో కలిసి ఏయూ ఎంఎస్ కోర్సులు

మద్దిలపాలెం: అమెరికన్ యూనివర్సిటీలతో కలిసి రెండు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సహకార మాస్టర్ ప్రోగ్రాంలను ప్రారంభించినట్టు ఏయూ వీసీ ఆచార్య పీజీవీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. స్కాంటన్ వర్సిటీలో రెండేళ్ల ఎంఎస్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సును ఏయూలో ఆన్‌లైన్‌లో ఏడాది, యూఎస్‌లో ద్వితీయ సంవత్సరం చదివే అవకాశం ఉంటుందన్నారు.

- ఎంఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌ను మిస్సౌరి స్టేట్ యూనివర్సిటీతో కలిసి ఏయూ సంయుక్తంగా అందిస్తుందని వీసీ తెలిపారు. ఇక్కడ విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీలో ఆన్‌లైన్‌లో మొదటి సంవత్సరం, యూఎస్ఏలో రెండో సంవత్సరం చదువుతారన్నారు. రెండూ స్టెమ్‌ల కోర్సుల వల్ల విద్యార్థులు ఎంఎస్ కోర్సులను పూర్తి చేసిన తర్వాత మూడేళ్లపాటు ఓపీటీకి అర్హులన్నారు. వారు యూఎస్ఏలో పని చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 94401 91968 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శారదానదిలో మునిగి యువకుడి మృతి



మహేష్ మృతదేహం

మునగపాక : సరదాగా స్నానం చేద్దామని నదిలోకి దిగిన యువకుడు మృత్యువాతకు గురైన దుర్ఘటన మండలంలోని గణపర్తిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ మల్కాపురం బాపూజీ కాలనీకి చెందిన దనాల మహేష్(17)తన స్నేహితులతో కలిసి తీన్‌మార్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు కొంకోట మండలం నరసింగబల్లి ఆదివారం వచ్చాడు. ఈ సందర్భంగా స్నేహితులతో కలిసి మహేష్ సమీపంలోని గణపర్తి శారదానదిలో స్నానం చేసేందుకు దిగాడు. దిగుతూనే ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. దీంతో తోటి స్నేహితులు ఆందోళనకు గురై కేకలు వేస్తూ బయటకు వచ్చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు మహేష్ కోసం గాలింపు చేపట్టారు. కొంతసేపటి తరువాత మహేష్ మృతదేహం లభ్యమైంది. మహేష్ మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఏఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాల్తేర్ డిపో సందర్శన



డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఎంవీపీ కాలనీ: డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు ఆదివారం వాల్తేర్ డిపోను సందర్శించారు. డిపోలోని పలు యూనిట్లను పరిశీలించి డ్రైవర్లు, కండక్టర్లతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రైనింగ్‌కు అనుగుణంగా డ్రైవర్లు, కండక్టర్లు మెయింటినెన్స్ పక్కాగా చేయాలని, మెకానిక్‌లు బస్సుల కండిషన్‌ను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ప్రయాణికులకు అందించే సేవల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ అప్పలరాజు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో ఉక్కు కార్మికుల భవిష్యత్తు అంధకారం



829వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే కార్మికుల భవిష్యత్తు అంధకారమవుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం 829వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ దీక్షలో కాంట్రాక్ట్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 30 ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం కార్మికులు, ఉక్కు నిర్వాసితులు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి రవి, ఎల్.సోంబాబు, నందికి తాతరావు, మరళీ కృష్ణ, మంగరాజు, కృష్ణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలపై సమావేశం నేడు

మద్దిలపాలెం: రాష్ట్రంలో యూనివర్సిటీ బోధనేతర సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి గా పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలు అమలు చేయాలని కోరుతూ సోమవారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశా నికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరవుతారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఎర్నిమాంబ జాతర



మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



ఆలయం వద్ద భక్తుల సందడి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు పరిధి జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి జాతరను దేవదాయ శాఖ, ఆయా సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ దర్శనాలకు క్యూలైన్లలో బారులు దీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ, ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయ నేతృత్వంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరం నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను, సుమారు 35 అమ్మవారి ప్రతిమలను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేవదాయశాఖ ఈవో బాబా, ఆయా సంఘాల ప్రతినిధులు, ఆలయ సిబ్బంది జాతరను పర్యవేక్షించారు.

గోతుల రహదారులతో అవస్థలు



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ జంక్షన్ వద్ద రాళ్లు తేలిన రహదారి



కరాసా ప్రాథమిక పాఠశాల వెనుక రోడ్డులో గోతులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52, 91 వార్డుల్లోని పలు రహదారుల దుస్థితి ఘోరంగా ఉంది. తాగునీటి సరఫరా, ఇతర ప్రజా ప్రయోజనాల కోసం తవ్విన రోడ్లను అలాగే వదిలేశారు. ఇలా గోతుల ఏర్పడిన రహదారులతో అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఏళ్ల గడుస్తున్నా ఇదే పరిస్థితి ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. 52వ వార్డు కరాసా ప్రియదర్శిని కాలనీలో తవ్వి వదిలేసిన గోతులు దారుణంగా తయారయ్యాయి. కరాసా ప్రాథమిక పాఠశాల వెనుక వీధిలో చాలా చోట్ల గోతులతో నిండి ఉంది. జీవీఎంసీ అధికారులు కొన్ని చోట్ల వీటిని కప్పి మరికొన్ని చోట్ల వదిలేశారని, దీంతో రాళ్లు తేలి ప్రమాదకరంగా మారాయని నివాసులు వాపోతున్నారు. 91వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిలో గోతులు, రాళ్లు తేలి ఉండడంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

సాముగరిడీ శిక్షణకు విశేష స్పందన



మెమొంటోలతో క్రీడాకారులు, గ్రామ కమిటీ సభ్యులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన సాముగరిడీకి మంచి ఆదరణ లభించిందని గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సీతారామ కల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో సాముగరిడి గురువు సానబోయిన అప్పలరాజును గ్రామ కమిటీ సభ్యులు, క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ అంతరించి పోతున్న క్రీడల్లో సాముగరిడి ఒకటని, దానిని నేటి విద్యార్థులకు నేర్పించాలనే తపన ఉందన్నారు. వేసవిలో అనేక మంది క్రీడాకారులు సాముగరిడి నేర్చుకోవడం అభినందనీయమన్నారు. పల్లా సత్యనారాయణ సొంత నిధులతో క్రీడాకారులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వై.వెంకటరావు, పి.వెంటకరమణ, పి.పెంటారావు, ఎస్.సంపత్, డి.రమణ, ఎన్.శంకరరావు, కె.వి.అప్పారావు, నూనెల రామారావు, పల్లా వెంకటరావు, కోనా రాము, పల్లా ధర్మారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కె.పి.రత్నాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



తొలిబాల్‌ను బౌండరీకి పంపిన ఎస్ఏ రెహమాన్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం చంద్రనగర్ మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని వైఎస్సార్‌సీపీ పశ్చిమ పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నీ నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అయితంశెట్టి గోపి మాట్లాడుతూ పోటీల్లో 42 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఫైనల్ మ్యాచ్ ఈ నెల 31 జరుగుతుందని అదే రోజు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ బహుమతులు అందజేస్తారన్నారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు టాస్ వేశారు. తొలి బంతిని రెహమాన్ ఆడి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, ఆళ్ల పైడిరాజు, స్థానిక నాయకులు గేదెల మురళీ కృష్ణ, వార్డు అధ్యక్షులు అప్పలస్వామి, గుణిశెట్టి శ్రీనివాసరావు, నమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం



మావూరి వీరమణి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మావూరి వీరమణి కుటుంబంతో కలిసి బర్మాక్యాంప్‌లో నివసిస్తోంది. నర్సింగ్ మొదటి సంవత్సరం పూర్తయింది. ఈ నెల 15న తల్లిదండ్రులతో కాలేజీకి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో యువతి బావ నరేంద్ర కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

పట్టాభిరెడ్డితోటకు చెందిన వాచ్‌మెన్

కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పట్టాభిరెడ్డితోటకు చెందిన వెన్నెల సింహాచలం ఈ నెల 14వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదు. సదరు వ్యక్తి గతేడాది వరకు ఏలూరులో ఉండి, విశాఖకు వచ్చాడు. పట్టిభిరెడ్డి తోటలో కొత్తగా కడుతున్న అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటారు. అతడి అన్నయ్య వెన్నెల రామారావు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాశరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.